సాక్షి
శ్రీకాకుళం
బుధవారం, 3, జూలై, 2024



డిగ్రీ ప్రవేశాలపై ఆశలు

డిగ్రీ ప్రవేశాలకు వేళయ్యింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు.

- 8లో



మొలకెత్తని వరి విత్తనాలు

కొత్తూరు మండలంలో వరి విత్తనాలు మొలకెత్తలేదు. రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

- 8లో

జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ ఎడ్యుకేషన్.జీవోవి.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

ఇక ఈపీడీసీఎల్ యాప్ ద్వారానే విద్యుత్ బిల్లుల చెల్లింపులు

- విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి



నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ

అరసవల్లి: విద్యుత్ వినియోగదారులు ఇంతవరకు నేరుగా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యూపీఐ పేమెంట్లు చేసేవారని, ఇకపై అలా కాకుండా ఏపీఈపీడీసీఎల్ యాప్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లింపులు జరపాలని స్థానిక సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాజా ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు ఇకమీదట ఏపీఈపీడీసీఎల్ యాప్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుందని, లేదంటే ఆ చెల్లింపులు పరిగణనలోకి తీసుకోవడం జరగదని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగదారులు ఈ మార్పులను గమనించి తమ ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి లేదా ఏపీఈస్ట్రన్‌పవర్.కాం వెబ్‌సైట్ నుంచి గానీ సంస్థ అధికారిక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇక మీదట ఆన్‌లైన్ పేమెంట్లు అన్నీ ఇలాగే చెల్లించాలన్నారు. అలాగే అన్ని పనివేళలతో పాటు సెలవు రోజుల్లో కూడా జిల్లాలో ముఖ్య కేంద్రాల్లో ఈఆర్వో కేంద్రాల్లో యథావిధిగా విద్యుత్ బిల్లులు నేరుగా చెల్లింపులు చేయవచ్చునని కూడా తెలియజేశారు.

శ్రీకాకుళం నగరపాలక కమిషనర్‌గా ఓబులేసు

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చల్లా ఓబులేసుకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమీమ్ అన్సారియా కమిషనర్‌గా పనిచేస్తూ ప్రకాశం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఓబులేసు ప్రస్తుతం సుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి

జలుమూరు: శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం ఆషాఢ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు.

ఆదిత్యుని కల్యాణం



కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు సాందీప్‌శర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం జ్యేష్ఠ బహుళ ఏకాదశి (మతత్రయ ఏకాదశి) సందర్భంగా మంగళవారం ఉదయం ఘనంగా జరిగింది. శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మూర్తులుగా అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేష వస్త్రాలతో పాటు తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేషనల్ స్పోర్ట్స్‌కు పొందూరు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందించిన జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ గోవిందరావు, తదితరులు

పొందూరు: ఇటీవల అనంతపురంలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో పొందూరు మండలం భవిత కేంద్రం విద్యార్థి నక్కిట్ల నాగహర్షవర్ధన్ ట్రెక్కింగ్ విభాగంలో నేషనల్ స్పోర్ట్స్‌కు ఎంపికైనట్లు జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ గోవిందరావు తెలిపారు. స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థిని అభినందించారు. మెమెంటోను, మెడల్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఉమ, హెచ్‌ఎం వెంకటరావు, ఐఈఆర్టీ దినేష్, రాధారాణి పాల్గొన్నారు.





గజ'ముద్ద' మనోహరంగా..

ఉద్దానంలో సంబరాలు జోరుగా జరుగుతున్నాయి. కంచిలి మండలం ఎక్కల గ్రామంలో మంగళవారం సింధుపోలమ్మ సంబరం, ఇచ్ఛాపురం మండలంలోని మండపల్లిలో గారపోలమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించి గజముద్దలు ఊరేగించారు.

- కంచిలి, ఇచ్ఛాపురం రూరల్

కొత్త కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్



- విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ జిల్లాకొస్తున్న కొత్త కలెక్టర్
- మంచి వ్యక్తిగా గుర్తింపు
- ప్రస్తుత కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్‌కు బదిలీ
- ప్రస్తుతానికి ఇవ్వని పోస్టింగ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా కొత్త కలెక్టర్‌గా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నియమితులయ్యారు. ప్రస్తుత కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్‌కు బదిలీ అయింది. ప్రస్తుతానికి పోస్టింగ్ ఎక్కడా ఇవ్వలేదు. ఈ ఏడాది జనవరి 28న ఎన్నికలకు ముందు ఇక్కడకు బదిలీపై వచ్చిన మనజిర్ జిలానీ సమూన్‌కు అనతి కాలంలోనే బదిలీ అయింది. ఇటీవల ఆయన సతీమణి తమీమ్ అన్సారియా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసి ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

మహారాష్ట్ర వాసి..

మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాకు చెందిన స్వప్నిల్ దినకర్ 1985 అక్టోబర్ 20న దినకర్ పుండ్కర్, భావన దంపతులకు జన్మించారు. ప్రాథమిక, ఉన్నత విద్య అనంతరం ఐఐటీ గౌహతిలో బీటెక్(కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్) చేశారు. నాలుగో ప్రయత్నంలో భాగంగా 2016లో సివిల్ సర్వీసుకు ఎంపికై ఐఏఎస్ సాధించారు. 2016 ఆగస్టు 29న జాయిన్ అయ్యారు. గుంటూరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి విడత ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. రెండో విడతగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నారు. 2018 నవంబర్ 14న నూజివీడు సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. 2020 మే 20న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడి నుంచి 2022 ఏప్రిల్ 4వ తేదీన విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి అక్కడే పనిచేస్తూ తాజా బదిలీల్లో జిల్లాకు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

జిల్లా కొత్త కలెక్టర్‌గా వస్తున్న స్వప్నిల్ దినకర్ సతీమణి పూజ ప్రస్తుతం విశాఖపట్నంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరికొక కుమార్తె ఉన్నారు. ఆయన విజయవాడలో పనిచేస్తున్న సమయంలోనే 2023లో దేశవ్యాప్తంగా నగరాల మధ్య శుభ్రత విషయంలో జరిగిన ర్యాంకింగ్‌లో విజయవాడకు ఆరో ర్యాంకు వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విజయవాడ నగరంలోని స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం, ఎయిర్‌పోర్టు కారిడార్, కృష్ణానది వెంబడి కృష్ణలంక వారధి నుంచి రామలింగేశ్వరనగర్ వరకు రివర్‌ఫ్రంట్‌పార్కు, జాతీయ రహదారి 65 వెంబడి శిథిలావస్థలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కు అభివృద్ధి వంటివి చేశారు. స్వప్నిల్ హయాంలోనే విజయవాడలో సేకరిస్తున్న ఇంటింటి చెత్తను ప్రాసెస్ చేసే విధానంపై అవగాహన కల్పించేందుకు అజిత్‌సింగ్‌నగర్‌లో ఇన్ఫర్మేషన్ పార్కు ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఉపకారం

- రికార్డులు సృష్టిస్తున్న కాశీబుగ్గ ఉన్నత పాఠశాల
- నాలుగేళ్లలో జాతీయ ఉపకార వేతనాలకు 33 మంది ఎంపిక



కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



కాశీబుగ్గ:

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డులు సృష్టిస్తోంది. జాతీయ ఉపకార వేతనాల పరీక్షల్లో ఏటా ఈ పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో రాణిస్తూ పాఠశాల కీర్తిని పెంచుతున్నారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు 2023లో పది మంది ఎంపిక కాగా.. ఈ ఏడాది 8 మంది ఎంపికయ్యారు. గత నాలుగేళ్లలో ఈ ఉపకార వేతనానికి అధిక మంది ఎంపిక కావడమే కాకుండా పదో తరగతి ఫలితాల్లోనూ అత్యున్నత ప్రతిభ చూపి విద్యార్థులు ఆకట్టుకుంటున్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో జిల్లా రికార్డు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కుటుంబాలన్నీ దాదాపు నిరుపేద నేపథ్యాలకు చెందినవే. ఉన్నత చదువు చదవాలంటే వారికి ఆర్థిక సాయం ఎంతో అవసరం. అలాంటి అవసరానికి మరింత తెలివితేటలు తోడైతే 'నేషనల్ మీన్స్-కం-మెరిట్ స్కాలర్‌షిప్' చేరువవుతుంది. ఇందులో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాశీబుగ్గ తనదైన ముద్ర వేస్తూ విజయకేతనం ఎగురు వేస్తోంది. 2021లో ఏడుగురు, 2022లో 8 మంది, 2023లో పది మంది, 2024లో 8 మంది ఈ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు.

ప్రత్యేకంగా తర్ఫీదునిస్తాం..



ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు పిల్లలకు కోచింగ్ ఇస్తాను. ఆ సిలబస్‌పై పూర్తి అవగాహన కల్పిస్తా. సిలబస్‌లో ఉండే ప్రతి విషయం వారికి వచ్చే విధంగా వివరణాత్మకంగా బోధిస్తా. బోధించిన విషయంపై ప్రతి రోజు వారికి 10 ప్రశ్నలు బోర్డుపై రాసి టెస్ట్ పెడతా. టెస్ట్ సమయం అయిన వెంటనే ఇచ్చిన 10 ప్రశ్నలను వివరిస్తా. గత పేపర్లను తీసుకుని పద్ధతి ప్రకారం అవగాహన కల్పిస్తాం. పరీక్ష అయ్యే వరకు స్కూల్ సెలవు దినాల్లో సైతం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తరగతులు చెబుతాను. మోడల్ పరీక్షలు, గ్రాండ్ పరీక్షలతో పిల్లలను సర్వ సన్నద్ధంగా తయారు చేస్తాను.

- కిల్లి వెంకటరావు, టీచర్, జెడ్పీహెచ్ స్కూల్, కాశీబుగ్గ

నాడు-నేడుతో సకల మార్పులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నాడు-నేడు పనులు ఈ పాఠశాలకు కొత్త ఊపిరి అందించాయి. కొత్త భవనాలతో పాటుగా తాగు నీటి ఆర్‌ఓ ప్లాంట్, ఇతర అన్ని నూతన సౌకర్యాలు కల్పించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు గట్టి పోటీ ఇస్తుండడంతో ఇక్కడ అడ్మిషన్ దొరకడం గగనంగా మారింది. ఈ పాఠశాలలో 1030 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు.



శిక్షకుడు వెంకటరావును అభినందిస్తున్న హెచ్‌ఎం చిన్నంనాయుడు, విద్యార్థులు

అధికార మదం



ఈ చిత్రం గమనించారా.. ఇందులో ఒకరిని బలంగా పట్టుకున్న వ్యక్తి పేరు సప్ప నవీన్. పలాసలోని ఓ కౌన్సిలర్ సుపుత్రుడు. టీడీపీ పలాస పట్టణ కార్యదర్శి కూడా. అతని చేతిలో నలిగిపోతున్న వ్యక్తి పేరు బల్ల గిరిబాబు. అచ్చంగా పలాస మున్సిపల్ చైర్మన్. ఓ పింఛన్ విషయమై తనను సంప్రదించకుండా సచివాలయ ఉద్యోగికి ఎలా ఆదేశాలు ఇస్తారంటూ సప్ప నవీన్ మున్సిపల్ చైర్మన్ గిరిబాబుతో నడి వీధిలో ఇలా వాదులాడారు. గొడవ కాస్తా ముదరడంతో ఇలా మెడ పట్టుకుని అదిమేశారు. అధికారం చేతిలో ఉంది కదా అని మున్సిపల్ చైర్మన్‌ను అగౌరవపరిచిన ఈ ఘటన పలాసలోని 24వ వార్డులో జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘోర అవమానం తర్వాత మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు కౌన్సిలర్లతో కలిసి కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

- కాశీబుగ్గ

సాగుదారుని హక్కు పత్రంపై అవగాహన



కౌలు రైతుకు సాగుహక్కు పత్రం అందజేస్తున్న డీడీ త్రినాథ స్వామి

రణస్థలం: కౌలు రైతులు సాగుదారుని పత్రం పొందడం వల్ల వ్యవసాయశాఖ ద్వారా వర్తించే రాయితీలను నేరుగా పొందవచ్చునని వ్యవసాయశాఖ డీడీ కె.త్రినాథ స్వామి తెలిపారు. మండలంలోని రణస్థలం గ్రామంలో కౌలు రైతుల హక్కు పత్రం కోసం వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతు పత్రం వల్ల విత్తనాలు, ఎరువులు, పంట నష్టం, బీమా లాంటి అన్నీ ప్రభుత్వ పథకాలు నేరుగా కౌలు రైతులు పొందవచ్చునని అన్నారు. భూమి యజమానికి ఎలాంటి నష్టం కలగదని, కేవలం పంటపై మాత్రమే కౌలు చేసే రైతులకి హక్కు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ ఏఓ డి.విజయభాస్కర్, పంచాయతీ సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు, వీఆర్వో జగన్నాథం తదితరులు ఉన్నారు.

99.2 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం సాయంత్రానికి జిల్లాలో 99.21శాతం పూర్తయ్యింది. పింఛన్ల పంపిణీలో జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో విజయనగరం ఉంది. మూడో స్థానంలో అనకాపల్లి,నాలుగో స్థానంలో పశ్చిమగోదావరి జిల్లాలు ఉన్నాయి. మన జిల్లాలో 3,19,147 పింఛన్లకు గాను రూ.211.70 కోట్లను విడుదల చేయగా, మంగళవారం సాయంత్రానికి 3,16,592 మందికి పింఛను అందజేసి రూ. 210.03 కోట్లను పంపిణీ చేశారు.

వివాహిత దారుణ హత్య

- కర్కశంగా నరికి చంపిన ఆటో డ్రైవర్
- తన ఆటోలోనే మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన వైనం
- పోలీసుల అదుపులో హంతకుడు



ఆటోలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ (ఇన్‌సెట్లో)మృతురాలు అమలాపురపు రాజేశ్వరి (ఫైల్)



హత్యకు పాల్పడిన గోపాల్

పొందూరు: మండలంలోని తాడివలస సమీపంలో చిన్న బొడ్డేపల్లి గ్రామానికి చెందిన వివాహిత హత్య మంగళవారం సంచలనం రేపింది. వివాహితను హత్య చేసిన ఆటోడ్రైవర్ ఆమె మృతదేహాన్ని నేరుగా పొందూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి లొంగిపోయాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

చిన్నబొడ్డేపల్లి గ్రామానికి చెందిన అచ్చయ్య, రాజులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అమలాపురపు రాజేశ్వరి భర్త గుప్తేశ్వరరావు మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె తన కుమార్తెతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుమార్తెతో పాటు తల్లిదండ్రులను పోషిస్తున్నారు. రెండు నెలల కిందట బొడ్డేపల్లి రైల్వేట్రాక్ పనులకు వచ్చిన నరసన్నపేట మండలం ఉర్లాం గ్రామానికి చెందిన ఆముజూరు గోపాల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. గ్రామంలోనే వారిద్దరూ తరచూ కలిసేవారు. మంగళవారం సంతకవిటి మండలం వాల్తేరులో శుభకార్యానికి వెళ్లడానికి సిద్ధమైన రాజేశ్వరి గోపాల్‌కు ఫోన్ చేసింది. గోపాల్ ఆటోపై చిన్నబొడ్డేపల్లికి వచ్చాడు. ఆటోలో ఇద్దరూ వాల్తేరుకు బయలుదేరారు. అయితే తాడివలస సమీపంలో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. గోపాల్ తనతో తెచ్చుకున్న చాకుతో రాజేశ్వరి మెడపై పలుమార్లు దాడిచేశాడు. దీంతో రాజేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన రాజేశ్వరిని గోపాల్ తన ఆటోలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి లొంగిపోయాడు. ఆమదాలవలస సీఐ దివాకర్‌యాదవ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారణ చేపట్టారు. మృతురాలి తల్లిదండ్రులు అచ్చయ్య, రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హత్య చేసిన గోపాల్‌తో కలిసి హత్య జరిగిన ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలను రాబట్టేందుకు విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

జిల్లా బ్యాడ్మింటన్ టోర్నీకి సన్నద్ధం

- 13, 14 తేదీల్లో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు
- అండర్-11,13,15,17,19, సీనియర్స్ 6 వయో విభాగాల్లో జరగనున్న పోటీలు
- శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహణ



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీకి రంగం సిద్ధమైంది. శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా ఈనెల 13, 14 తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయి. నారాయణశెట్టి వాసు మెమోరియల్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పేరిట పోటీలను నిర్వహిస్తున్నారు. క్రీడలపై ఆసక్తి కలిగిన సినీ నిర్మాత, వ్యాపారవేత్త నారాయణశెట్టి కిరణ్‌కుమార్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను అందిస్తున్నారు. అలాగే ఈ మెగా టోర్నమెంట్‌కు కో-స్పాన్సర్‌గా ఆర్‌ఓఎస్ రీహేబిటేషన్ డాక్టర్ వెలమల వినోద్‌కుమార్ వ్యవహరిస్తుండగా, శ్రీకాకుళం జిల్లా నుంచి రాష్ట్రపోటీలకు వెళ్లే క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేసేందుకు లక్ష్మీ సింహాద్రి కనస్ట్రక్షన్ రియల్ ఎస్టేట్ ఎండీ గంజి భీమారావు ముందుకొచ్చారు. ఈ పోటీలు అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 బాలబాలికలకు, అలాగే స్త్రీ,పురుషులు(సీనియర్స్) వయో విభాగాల్లో జరగనున్నాయి. ఇక్కడ రాణించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు పంపించనున్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పించేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ఆసక్తి కలిగి పాల్గొనదలిచే క్రీడాకారులు వెంటనే సంపతిరావు సూరిబాబు 94402 55255, 83285 14385 నంబర్లకు కాల్‌చేసి తమ ఎంట్రీలను నమోదుచేసుకోవాలని సంఘ ప్రతినిధులు వెల్లడించారు.

విజయవంతం చేయాలి

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్‌చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం శాంతినగర్‌కాలనీలోని ఇండోర్ స్టేడియంలో టోర్నమెంట్‌కు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సీఈఓ సంపతిరావు సూరిబాబు, సంయుక్త కార్యదర్శి గురుబెల్లి ప్రసాద్, కోశాధికారి గోర అనీల్‌కుమార్, రౌతు సంతోష్‌కుమార్, మెండ శాంతికుమార్, కోచ్ ఢిల్లేశ్వరరావు, మనోహర్ పాల్గొన్నారు.

13న తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల



వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలోని పాత ఆయకట్టుకు ఈ నెల 13న సాగునీరు విడుదల చేస్తామని జలవనరుల శాఖ డీఈఈ దమలపాటి రవికుమార్ మంగళవారం తెలిపారు. పార్వతీపురం మన్యంతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేస్తామన్నారు. జలాశయం పరిధిలోని చెరువులను నింపేందుకు తొలుత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. 64 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

'దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయండి'


టెక్కలిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

టెక్కలి: విద్యారంగంలో జరుగుతున్న అవకతవకలపై గురువారం చేపట్టనున్న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యు.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం టెక్కలిలో పోస్టర్లను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా వివిధ రకాల విద్యా పరీక్షల్లో ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాగే పాఠశాల విద్యా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ చేపట్టనున్న ఈ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బి.తరుణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టం.. కొత్త కేసు


లేవలేని స్థితిలో క్షతగాత్రుడు గిరి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని అరసవల్లి మిల్లు కూడలి సమీపంలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. దీనికి కొత్తగా రూపొందించిన భారతీయ న్యాయ సంహిత చట్టం కింద తొలి కేసు నమోదు చేయడం విశేషం. ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం చెప్పిన వివరాల మేరకు నగరంలోని నానుబాలవీధికి చెందిన గోరుచుట్టి గిరి (24) తన మిత్రుడు గుణశేఖర్‌తో కలిసి పాతబస్టాండు నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గుణశేఖర్ బండి నడుపుతున్నాడు. అదే సమయంలో వెనుకగా వచ్చిన కారు ఉమెన్స్ కాలేజీ రోడ్డు వెళ్లే క్రమంలో అతి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో గిరి, గుణశేఖర్ ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. పడిపోయిన గిరిని స్థానికులు కూర్చోబెట్టి తర్వాత లేపినా లేవలేని స్థితిలో ఉండటంతో వెంటనే 108 అంబులెన్సులో వైద్య చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. గిరికి నడుము ఎడమవైపు ఎముక విరిగినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో ఎస్‌ఐ మెట్ట సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఓపెన్ స్కూల్ సొసైటీ తాజాగా విడుదల చేసిన ఈ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. టెన్త్ పరీక్షకు 459 మంది విద్యార్థులు హాజరు కాగా 51.85 శాతం ఉత్తీర్ణతతో 238 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1108 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 52.13 శాతం ఉత్తీర్ణతతో 633 మంది పాసయ్యారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో రెండింటిలోను శ్రీకాకుళం జిల్లా 19వ స్థానంలో నిలిచింది. కాగా పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి ప్రింటెడ్ మార్క్సు మెమోలను వారి అధ్యయన కేంద్రాలకు వెళ్లి నేరుగా పొందవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.200, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా గానీ, ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌నందు పొందుపరిచిన గేట్‌వే పేమెంట్ ద్వారా ఫీజు చెల్లించాలని ఆయన కోరారు. డీడీలు, మరే ఇతర చెల్లింపులు అంగీకరించరని డీఈఓ స్పష్టం చేశారు.

క్లాస్‌వర్క్, హాస్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి


మెస్‌లో వీసీ రజనితో భోజనం చేస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: క్లాస్‌వర్క్, హాస్టల్ నిర్వహణ, మెస్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీ వసతి గృహాన్ని, మెస్, అల్ట్రా మోడ్రన్ కిచెన్‌ను అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం మెస్‌ను పరిశీలించారు. మెస్ పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులో ఉందని వీసీ అన్నారు. అకడమిక్ క్యాలెండర్ మేరకు క్లాస్‌వర్క్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మంగళవారం నాటికి మెస్‌లో 360 మంది భోజనం చేశారని, పూర్తిస్థాయిలో విద్యార్థులు రెండు రోజుల్లో హాజరు కావచ్చునని అన్నారు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ వసతి గృహాల్లో మరమ్మతులు సైతం చేసినట్లు చెప్పారు. రన్నింగ్ నీటి సౌకర్యం, నాణ్యత గల మరుగు దొడ్లు వంటి సౌకర్యాలు కల్పించామన్నారు. నిర్వహణకు సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట రిజిస్ట్రార్ పి.సుజాత, చీఫ్ వార్డెన్ ఎస్.లోకేశ్వరి, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న ఉన్నారు.

డిగ్రీ ప్రవేశాలపై ఆశలు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

- రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 102 డిగ్రీ కళాశాలలు
- సీట్లు 25000

ఎచ్చెర్ల క్యాంపస్:

డిగ్రీ ప్రవేశాలకు వేళయ్యింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 10 నియోజక వర్గాల్లో 102 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 15 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 25,000 వరకు సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది డిగ్రీ ఆరో సెమిస్టర్ (చివరి సెమిస్టర్) 9832 మంది రిలీవ్ అయ్యారు. మొదటి ఏడాది మాత్రం 8299 మంది ప్రవేశాలు పొందారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలపై ప్రైవేట్ కళాశాలలు ఆశలు పెట్టుకున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం మెరుగ్గా ప్రవేశాలు జరుగుతున్నాయి.

డిగ్రీ ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్మీడియెట్ మార్కులు, రిజర్వేషన్ రోస్టర్, ప్రత్యేక కేటగిరీ వంటి అంశాల ఆధారంగా సీట్లు లభిస్తాయి. ఒకటో తేదీన నోటిఫికేషన్ విడుదల కాగా, 10వ తేదీలోపు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ప్రభుత్వ కళాశాలల్లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. 19 తేదీన సీట్లు అలాట్‌మెంట్ చేస్తారు. 20 నుంచి 22వ తేదీ మధ్య విద్యార్థులు సీటు వచ్చిన కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. దివ్యాంగులు, ఎన్‌సీసీ, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, ఇతర ప్రత్యేక కేటగిరీల విద్యార్థులకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి పట్టణాల్లో ఏర్పాటు చేసి సహాయ కేంద్రాల్లో 4నుంచి 6వ తేదీ వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు.

బీఆర్‌ఏయూ పరిధిలో ఆర్ట్సు, సైన్స్, కామర్స్, మేనేజ్ మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్ వంటి కోర్సులు ఉన్నాయి. ఇంటర్మీడియట్ గ్రూప్ ఆధారంగా ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది. మరో పక్క కొన్ని కోర్సులకు జాతీయ సాంకేతిక విద్యా మండలి (ఎన్‌సీటీ ఈ) గుర్తింపు తప్పని సరి చేశారు. బీసీఏ, సీబీఏ, బీఎంఎస్ వంటి కోర్సుల నిర్వహణకు ఎన్‌సీటీఈ గుర్తింపు తప్పని సరి, ఈ కోర్సులు కొన్ని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో నిర్వహిస్తున్నారు.

87 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల ప్రవేశాల కోసం వర్సిటీ అఫిలియేషన్ మంజూరు చేయాల్సి ఉంటుంది. ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు జూన్ నెలలో 17 ద్విసభ్య అఫిలియేషన్ కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీలు, కళాశాలలు పరిశీలించి ఉన్నత విద్యా మండలికి రిపోర్టులు అందజేశారు. కొన్ని కళాశాలలకు శాశ్వత, మరికొన్ని కళాశాలలకు షరతులతో కూడిన గుర్తింపు మంజూరు చేశారు.

జిల్లాలో కొన్ని డిగ్రీ కళాశాలల్లో కనీసం 30 శాతం ప్రవేశాలు జరగటం లేదు. కనీసం కళాశాల నిర్వహించాలంటే 50 శాతం ప్రవేశాలు జరగాలి. కళాశాలల్లో ప్రవేశాల్లో చేరే విద్యార్థులు కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పరిశీలించి చేరటం మంచిది. గత కొన్నేళ్ల నుంచి ప్రవేశాలు, ఫలితాలు, ప్లేస్ మెంట్లు, ఇతర నైపుణ్య శిక్షణలు పరిగణనలోకి తీసుకుని చేరితే మంచి భవిష్యత్ ఉంటుంది.

నోటిఫికేషన్ మేరకు ప్రవేశాలు

ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ మేరకు ప్రవేశాలు నిర్వహిస్తారు.విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకోవాల్సి ఉంటుంది. జాప్యంలేకుండా అఫిలియేషన్ బృందాలు పరిశీలన పూర్తిచేసి, నివేదిక ఉన్నత విద్యా మండలికి అందజేస్తారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది.

– పి.సుజాత, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పరిశ్రమలకు మంజూరు చేసిన భూమి వివరాలు తెలపాలని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్ పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ముందుగా పరిశ్రమల శాఖ, సంబంధిత చేనేత జౌళి, ఉద్యానవన, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీఎంఐపి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తదితరులు చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు మంజూరు చేసిన భూమి పరిశ్రమల నిర్వహణలో లేకుంటే వాటి వివరాలు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

ఇన్‌చార్జి ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు రమణారావు మాట్లాడుతూ జిల్లాలో 23 భారీ పరిశ్రమలు రూ. 5885.69 కోట్ల పెట్టుబడితో స్థాపించి 12,769 మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. మరొక పరిశ్రమ నిర్మాణ దశలో ఉందన్నారు. 2023–2024లో 4597 ఎంఎస్‌ఎంఈలు రూ.412.00 కోట్ల పెట్టుబడితో స్థాపించి 16,515 మందికి ఉపాధి కల్పించాయన్నారు. 2024 మే మాసాంతానికి 369 ఎంఎస్‌ఎంఈలు రూ.10.10 కోట్ల పెట్టుబడితో స్థాపించి 1401 మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. సులభతర వాణిజ్యం కింద పరిశ్రమలకు అవసరమైన అన్ని రకాలైన అనుమతులు ఆన్‌లైన్ ద్వారా 21 రోజుల్లో జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఐడీపీ 2023–27 ప్రభుత్వం ప్రకటించినదని దీని ప్రకారం జనరల్, బీసీ అభ్యర్థులకు 15% ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ రూ.20 లక్షలకు మించకుండా, మహిళలకు రూ.30 లక్షలకు మించకుండా ఇస్తామన్నారు. భారత ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 17న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, సంప్రదాయ కళాకారులు చేతి పని ముట్లతో పనిచేసే క్రాఫ్ట్ వ్యక్తులకు గుర్తింపు సంపూర్ణ మద్దతును అందించడం కోసం ఈ పథకం పూర్తిగా జీఓఐ ద్వారా నిధులు సమకూరుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, సీటీఓ రాణీమోహన్, ఎల్‌డీఎం సూర్య కిరణ్, డ్వామా మేనేజర్ మురళీ, మైనింగ్ ఏడీ సత్యనారాయణ, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాస్, ఏపీఈపీడీఎల్ ఈఈ ఎల్సియస్ పాత్రుడు, చేనేత జౌళిశాఖ ఎడి సాయిప్రసాద్, ఉద్యానవన శాఖ ఏడీ ప్రసాదరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రామారావు, రఘునాథ్ రావు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లకు గాయాలు


గాయాలతో బొల్లు సూరిబాబు

బూర్జ: ఉప్పపేట–వావాం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో బొల్లు సూరిబాబు, త్రినేత్రలకు గాయాలయ్యాయి. గ్రామస్తులు, స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలో గల ఉప్పపేట గ్రామానికి చెందిన త్రినేత్ర శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీఏ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమెను తండ్రి సూరిబాబు బైక్‌పై గ్రామం నుంచి బూర్జ జంక్షన్‌కు తీసుకెళ్తుండగా పాలకొండ డిపోకు చెందిన ఆర్టీసీ స్టూడెంట్సు బస్సు బూర్జ గ్రామం వైపు నుంచి ఉప్పపేట గ్రామం వైపు వస్తూ ఈ బండిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో వీరిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. బొల్లు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బస్సు బూర్జ పోలీసు స్టేషన్ ఆవరణలో ఉంచారు.

మొలకెత్తని వరి విత్తనాలు


కర్లెమ్మలో మొలక శాతం తక్కువ వచ్చిన పొలం

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, కర్లెమ్మ, వసప గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో 1061 వరి రకం విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఏపీ సీడ్స్ విత్తనాలను ప్రభుత్వం విక్రయించింది. పది రోజుల కిందట ఈ విత్తనాలను పొలాల్లో వేశారు. పది రోజులు గడుస్తున్నా అంతంతమాత్రంగానే మొలకలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పదును ఉన్న సమయంలోనే విత్తనాలు వేశామని, మొలక రాకపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని, మళ్లీ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో సారి విత్తనాలు వేసేందుకు వాతావరణం ఎలా సహకరిస్తుందో తెలీడం లేదని అంటున్నారు. కొందరు రైతులు రైతు భరోసా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్థానిక వ్యవసాయ అధికారి వద్ద 'సాక్షి' వివరణ కోరగా.. మొలకలు రాని పొలాలను బుధవారం ఏపీ సీడ్స్ అధికారులు పరిశీలిస్తారని తెలిపారు.

జల్లువానిపేటలో పోలీసు తనిఖీలు

నరసన్నపేట: జల్లువానిపేటలో మంగళవారం రాత్రి 8 తర్వాత నరసన్నపేట పోలీసులు హడావుడిగా వచ్చి సోదాలు చేయడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు.

నరసన్నపేట సీఐ ప్రసాదరావు తదితరులు ఇంటింటికీ వెళ్లి సోదాలు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు హడలిపోయారు. ఏమైందో అని ఆందోళనకు గురయ్యారు. పోలీసుల సోదాల్లో అనుమాన వస్తువులు లభించకపోవడంతో నరసన్నపేట సీఐ బి. ప్రసాదరావు, పోలాకి ఎస్‌ఐ తదితరులు వెళ్లిపోయారు. దీనిపై నరసన్నపేట సీఐ మాట్లాడుతూ జల్లువానిపేటలో మూడు ఇళ్లల్లో నకిలీ కరెన్సీ, మాదక ద్రవ్యాలు ఉన్నట్లు ఫోను వచ్చిందని, దీంతో వెళ్లి సోదాలు నిర్వహించామని, కానీ తర్వాత ఈ ఫోన్ కాల్ ఫేక్‌గా గుర్తించామని అన్నారు. పోలీసులు ఇలాంటి సోదాలు చేయడంపై మాజీ సర్పంచ్ జల్లు తిరుమలరావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధంగా ఉన్నఫళాన సోదాలు చేసి చివరికి అది ఫేక్ అని చెప్పడం శోచనీయమన్నారు.


గ్రామంలో రోడ్డుపై ఆందోళన చెందుతున్న యువకులు

జర్నలిస్టులకు టోల్ ఫీజ్ మినహాయించాలని వినతి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం అందజేస్తున్న విజయనగరం ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం: ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ టోల్ ఫీజ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయనకు స్వయంగా వినతి పత్రం అందజేసి విన్నవించారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ


కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆరుబయట వర్షానికి తడుస్తున్న ద్విచక్రవాహనాలు

కాశీబుగ్గ: ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న లక్షల రూపాయల విలువైన ద్విచక్రవాహనాలు కాశీబుగ్గ పోలీసు స్టేషన్ ఆవరణలో పడి ఉన్నాయి. వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఎలాంటి వేలం పాటలు వేయక ఇలా వృథాగా పడి ఉన్నాయి. కేసు పరిష్కారం కాక, వేలం పాట కాక వాహనాలు అనవసరంగా పాడవుతున్నాయని అంటున్నారు.

పారిశ్రామిక వాడలో కార్మికుడు మృతి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో గల శ్రేయస్ పరిశ్రమలో షమిల్ షేక్(22) అనే కార్మికుడు జారిపడి మృతి చెందాడు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మంగళవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన రహిబుల్ షేక్ అనే యువకుడితో పాటు షమిల్ షేక్ పరిశ్రమలో పని ముగించుకుని వెళ్లిపోతున్న చివరి నిమిషంలో జారిపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా షమిల్ షేక్ అనే కార్మికుడు మృతి చెందాడు. మరో కార్మికుడు చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంటనే జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించి కేసు నమోదు చేశారు.

ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజీకి మార్చుకోండి: ఎస్పీ


ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజ్ (పీఎస్పీ) కింద అందిస్తున్న ప్రమాద బీమా పాలసీని పోలీసులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక కోరారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ బొడ్డేపల్లి గన్నయ్య నామినీ అయిన భార్య బి.వరహాలమ్మకు పీఎస్పీ కింద రూ. 75 లక్షల చెక్కును ఎస్పీ తన చేతుల మీదుగా అందించారు. చనిపోయిన కానిస్టేబుల్ గన్నయ్య పేరున కొర్లకోట ఎస్బీఐ శాఖలో ఖాతా ఉండటంతో పీఎస్పీ వ్యక్తిగత ప్రమాద బీమా కింద ఈ సొమ్ము వచ్చిందని ఎస్పీ అన్నారు. తక్షణమే పోలీసులంతా శాలరీ అకౌంట్లను స్టేట్‌బ్యాంకు పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద మార్చుకోవాలని, నామినీ పూర్తి వివరాలు బ్యాంకులో సమర్పించాలన్నారు. ఏడాదికి అదనంగా రూ.వెయ్యి వ్యక్తిగత ప్రమాద బీమా చేసుకుంటే అదనంగా మరో రూ. 20 లక్షల బీమా పొందేవారని తెలియజేశారు. ఎస్బీఐ రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసీఫ్ అమీర్ మాట్లాడుతూ మొత్తం ఏడాదికి రూ.వెయ్యి కడితే రూ. 95 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని, తక్షణమే బ్యాంకుకెళ్లి తమశాలరీ అకౌంట్స్ పీఎస్పీ కింద ఉన్నది లేనిదీ సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలోఅదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, బ్యాంకు స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ కామ్రేడ్ కేసీహెచ్ వెంకటరమణ, పోలీసు ఉద్యోగుల అసోసియేషన్ సెక్రటరీ కె.రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులు కృష్ణంనాయుడు, భుజంగరావు, బ్యాంకు చీఫ్ మేనేజర్ గోపీనాథ్, కొర్లకోట స్టేట్‌బ్యాంకు మేనేజర్ బి.సాయిరాం, బి.దాలినాయుడు, శ్రీనివాస్, క్రాంతి, సునీల్ పాల్గొన్నారు.

'10న నిరసనలు జయప్రదం చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం వారు సమావేశం నిర్వహించారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన వెంటనే బీజేపీ తన పాత విధానాలనే కొనసాగించటానికి నిశ్చయించుకుందని, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తోందని తెలిపారు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సకాలంలో చెల్లించని యజమానులకు వేసే జరిమానాపై రాయితీలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, దీని వల్ల రాబోయే కాలంలో యజమానులు పీఎఫ్ బకాయిలు సకాలంలో చెల్లించకుండా జాప్యం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి సిద్ధమవుతోందన్నారు.

లేబర్ కోడ్‌ల అమలు జరిగితే నేడు ఉన్న చట్టాల సారమంతా పోతుందని, సమ్మెలు చేయడం కూడా సాధ్యం కాదన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనం చెల్లించి, పెన్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైర్ ఇంజిన్ ఏర్పాటు చేయాలన్నారు. రిమ్స్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. నీలం జ్యూట్ పరిశ్రమను వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ బ్రివరీస్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

మందస రైస్ మిల్ కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, జిల్లా కార్యదర్శులు ఎన్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు కాశీ క్షేత్రంగా లంకపేట'


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శరత్ చంద్ర

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గార మండలం గొంటి పంచాయతీలోని లంకపేట గ్రామంలో ఘంటసాల స్మారక పీఠాన్ని కాశీ క్షేత్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని గాయకుడు టి.శరత్ చంద్ర తెలిపారు. స్థానిక గరిమెళ్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉదయం జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 4న గురువారం సుప్రభాతం నుంచి లంకపేటలో వేదోక్తమైన కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రప్రథమ పీఠాధిపతిగా శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వరప్రసాద్ గురూజీ బాధ్యతలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. 9 మంది గురు ఘనాపాఠీల దివ్య ఆశీస్సులు అందజేస్తారని, అనంతరం పీఠం ప్రాంగణంలోని శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి వారికి మహా రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. చండీ నవగ్రహ, సుదర్శన హోమాలు జరుగుతాయని తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమాల్లో భాగంగానే, పీఠం ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, భక్తులకు పవిత్ర ప్రసాద వితరణ ఉంటాయన్నారు. అనంతరం అష్టాదశ పీఠ గోశాల, నక్షత్రవనం ప్రారంభోత్సవాలు జరుగుతాయన్నారు. లంకపేటలో కార్యక్రమాలు ముగిశాక సాయంత్రం 5గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో స్వర సమ్రాట్ డాక్టర్ టి.శరత్ చంద్ర సుస్వర సారథ్యంలో 'ఘంటసాల గీతామృతం' కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పొందూరు: స్థానిక రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. రైలు ఢీకొనడంతో ప్లాట్‌ఫాం మీదకు తుళ్లిపోయి ఉండవచ్చునని చెప్పారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 25 నుండి 30 ఏళ్లు ఉండవచ్చునని చెప్పారు. నలుపు రంగు షర్టు ధరించాడని తెలిపారు. కుడి భాగాన ఛాతీ నుంచి తొడల వరకు కాలిపోయిన నల్లని మచ్చలు ఉన్నాయని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9493474582 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

లారీని ఢీ కొన్న వ్యాన్


వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకొని ఉన్న డ్రైవర్ ప్రవీణ్‌కుమార్

నందిగాం: మండలంలోని పాలవలసపేట సమీప జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పలాసకు చెందిన కె.ప్రవీణ్‌కుమార్ క్లీనర్‌తో పాటు తన వ్యాన్‌లో హిరమండలం బయల్దేరారు. నందిగాం మండలం పాలవలసపేట వద్దకు వచ్చేసరికి తన వ్యాన్ బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో అదే మార్గంలో వెళ్తున్న లారీని వెనుకనుంచి ఢీ కొట్టారు. దీంతో వ్యాన్ క్యాబిన్‌లో ఇద్దరు చిక్కుకున్నారు. ప్రమాదం గమనించిన స్థానికులు 108 వాహనానికి హైవే అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న హైవే సిబ్బంది క్రేన్ సాయంతో వారిని బయటకు తీసి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రిమ్స్ కళాశాల ఆఫీస్ సూపరింటెండెంట్‌గా సాయిరాం

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్‌గా హనుమంతు సాయిరాంను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. నర్సింగ్ కళాశాలలో పనిచేస్తున్న సాయిరాంను పదోన్నతిపై వైద్య కళాశాల ఆఫీసు సూపరింటెండెంట్‌గా నియమించారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.